క్లుప్తంగా

నేడు వాసవీ జయంతి వేడుకలు

దొనకొండ: స్థానిక పట్టాభి రాముల వారి దేవస్థానంలో బుధవారం వాసవీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘ నిర్వాహకులు తెలిపారు. మండలంలోని ఆర్యవైశ్యులంతా పాల్గొని జయంతి వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



కురిచేడు: గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా రిసోర్స్‌పర్సన్ ఏఎస్ఎం కోటేశ్వరి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అదే విధంగా విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు వినిపించడం, ఇండోర్ గేమ్స్ ఆడించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథపాలకురాలు ఎల్ సుమతి, మహిళా పోలీస్ ప్రమీల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు శిక్షణ తరగతులు



విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీఓ హేమలత

దర్శి(కురిచేడు): ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులకు స్థానిక కస్తూర్బా లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. కార్యక్రమాలను సమగ్ర శిక్ష అభియాన్ జీసీడీఓ హేమలత మంగళవారం పరిశీలించారు. శిక్షణ తరగతుల్లో ముండ్లమూరు, పొదిలి, దొనకొండ, కొనకనమిట్ల, కురిచేడు, దర్శి నుంచి మొత్తం 82 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. శిక్షణ కార్యక్రమాలు సప్లిమెంటరీ పరీక్షల వరకు కొనసాగుతాయన్నారు. జిల్లా గరల్‌ఛైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి కె.హేమలత కేజీబీవీలో శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు.

వేడుకగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠ

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, పోలేరమ్మతల్లి ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. వాస్తు సిద్ధాంతి, ప్రతిష్ఠాచార్యులు పండిత దైవజ్ఞశర్మ ఆధ్వర్యంలో కంకణధారులతో హోమాలు నిర్వహించారు. రాత్రికి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి పౌరాణిక నాటకం ఏర్పాటు చేశారు. బుధవారం పూజలతోపాటు విగ్రహాల గ్రామోత్సవం, రాత్రికి విద్యుత్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

బేస్తవారిపేట: పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి జక్కం మెర్సీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీలుగలు 10 కిలోలు రూ.1230 కాగా సబ్సిడీ రూ.615, జనుములు 10 కిలోలు రూ.1090 కాగా సబ్సిడీ రూ.545, పిల్లి పెసర 8 కిలోల విత్తనాలు రూ.1440 కాగా రూ.720 సబ్సిడీ వర్తిస్తుందని వివరించారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

అర్ధవీడు గురుకులానికి రెండు అవార్డులు

బేస్తవారిపేట(అర్ధవీడు): స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు రెండు అవార్డులు వచ్చినట్లు ప్రిన్సిపాల్ బండి బలరామిరెడ్డి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో నూరు శాతం ఫలితాలు సాధించడంతో రాష్ట్ర స్థాయిలో బెస్ట్ స్కూల్ అవార్డు, బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. గురుకుల పాఠశాలల్లో జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థి పి.కోటేశ్వరరావు 576 మార్కులతో బెస్ట్ స్టూడెంట్ అవార్డుకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల, పాఠశాల అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

20న జాతీయ సమ్మెకు నోటీసులు అందజేత

గిద్దలూరు రూరల్: ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో మెప్మా అధికారి ప్రసాద్‌కు ఆర్పీలు మంగళవారం నోటీసులు అందజేశారు. సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్నామని ఆశా వర్కర్లు డాక్టర్ భార్గవ్‌రెడ్డికి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌కు సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్ అమలు తదితర డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నట్లు తెలిపారు.

సమయపాలన ఏదీ సారూ..?

- విధులకు సమయపాలన పాటించని అధికారులు, సిబ్బంది
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



ఎంపీడీఓ కార్యాలయంలో 11.30 గంటలకు ఖాళీగా ఉన్న సిబ్బంది కుర్చీలు

కురిచేడు: మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. కార్యాలయానికి ఎప్పుడు వస్తారో ..ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, అటెండర్లు, కాంట్రాక్టు మినహా ఏ ఒక్కరూ సకాలంలో హాజరు కావడం లేదు. మంగళవారం మధ్యాహ్నం 11:30 గంటల సమయంలో కార్యాలయాన్ని తనిఖీ చేస్తే ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఉదయం 10 గంటలకు హాజరు కావాల్సిన మండల కార్యాలయం అధికారులు, సిబ్బంది మధ్యాహ్నం వరకు హాజరు కాకపోవటంతో వివిధ పనులపై వచ్చిన ప్రజలు, ప్రజా ప్రతినిధులు వెనక్కి తిరిగి వెళుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ కార్యాలయాపై అజమాయిషీ కొరవడింది. ఫలితంగా అధికారులు, సిబ్బంది ఎప్పుడు ఎక్కడ ఉంటారో అర్థం కాని పరిస్థితి. జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే ఇక్కడే ఉండే సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా స్థానికంగా నివాసం ఉండకుండా సుదూర ప్రాంతాల నుంచి సిబ్బంది రాకపోకలు సాగించడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని ప్రజలంటున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు దృష్టి సారించి సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి ప్రసాదరావు



దొనకొండలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేస్తున్న సిబ్బంది

దొనకొండ: రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరని వ్యవసాయాధికారి ఎస్ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని మల్లంపేట రైతు సేవా కేంద్రంలోని వల్లపునేనిపల్లి గ్రామంలో రైతు విశిష్ట సంఖ్య నమోదును ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య గురించి రైతులకు అవగాహన కల్పించారు. పొలం ఉన్న ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలు, రాయితీలు పొందాలంటే విశిష్ట సంఖ్య నమోదు తప్పని సరిగా చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాల్లో నేరుగా లబ్ధి పొందే అవకాశం రైతుకు లభిస్తుందన్నారు. మండలంలో 9243 మంది రైతులకు గాను 5063 మంది రైతులకు ఫార్మర్ ఐడీలను రైతు సేవా కేంద్ర సిబ్బంది నమోదు చేశారన్నారు. ఇంకా 4180 మంది రైతులు చేయించుకోలేదని తెలిపారు. వీరంతా వెంటనే రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి చేసుకోవాలని ఏఓ తెలిపారు.

తాళ్లూరు: రైతులు నేలను సారవంతం చేస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు అన్నారు. మండలంలోని తూర్పు గంగవరం రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులకు పంటలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోమవర్పాడులో ఉన్న రైతులకు ఈ వేసవిలో భిన్నమైన వాతావరణం పరిస్థితుల దృష్ట్యా భారీ వర్షాలుతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని, ఆ సమయంలో విద్యుత్ మోటర్లు ఆన్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఏఓ బి.ప్రసాదరావు, ప్రకృతి సాగు ట్రైనర్ జె.ప్రభాకర్ రావు, ఇన్‌చార్జి పి నరసింహులు, ఐసీఆర్పీలు వాణి, రమేష్, కోట రత్నం, అనంతలక్ష్మి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదకరం.. పట్టించుకోండి..!



చెరువు కట్టపై కోతకు గురైన రోడ్డు మార్జిన్



చెరువు కట్టపై రోడ్డు మార్జిన్ కొట్టుకుపోయిన దృశ్యం

కురిచేడు:

స్థానిక రైల్వేస్టేషన్‌కు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పెద్ద చెరువుకట్టపై సైడు మార్జిన్ ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై రైల్వేస్టేషన్‌తో పాటు మండలంలోని ఆవులమంద, నాయుడుపాలెం, కల్లూరు, ముష్టి గంగవరం, పడమర కాశీపురంతో పాటు త్రిపురాంతకం మండలంలోని కంకణాలపల్లి, ఒడ్డుపాలెం, త్రిపురాంతకం, దొనకొండ మండలంలోని దేశిరెడ్డిపల్లి, చందవరం గ్రామాల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తారు. పశువులు, బండ్లు, అరకలు, మూగజీవాలు, వ్యవసాయ కూలీలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. స్టేషన్ రోడ్డులోని నివాసం ఉండే మహిళలు చెరువులో బట్టలు ఉతుక్కునేందుకు వెళుతుంటారు. అయితే రోడ్డు మార్జిన్లు సక్రమంగా లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని ప్రాంతాల్లో రోడ్డు మార్జిన్ కోతకు గురై అడుగు లోతు వరకు గుంతలు పడింది. మూలమలుపుల్లో చెరువు కట్టకు ఇరువైపులా రోడ్డు మార్జిన్ పూర్తిగా కొట్టుకుపోయింది. ఆ స్థలంలో వాహనాలు ఎదురుదెరుగా వచ్చినప్పుడు వెళ్లేందుకు అవకాశం లేక చెరువులో గానీ, పొలాల్లో పడిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు మార్జిన్ గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఖనిజ సంపద కార్పొరేట్లకు దోచిపెడుతున్నారు



సభలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

యర్రగొండపాలెం: అటవీ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపద దేశంలో ఉన్న బడా కార్పొరేట్లకు దోచిపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ అన్నారు. స్థానిక పూల సుబ్బయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించిన సీపీఐ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ఖనిజ సంపదను వెలికి తీయడం వలన అడవులు అంతరించి పోతాయని, తద్వారా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని అన్నారు. మావోయిస్టులను అంతమొందించాలన్న నెపంతో అమాయకులైన ఆదివాసులు, గిరిజనులపై దాడి చేసి కాల్చిచంపడం సరైన పద్ధతికాదని, కాల్పులు ఉపసంహరించుకొని మావోయిస్టులు, ఆదివాసులతో చర్చలు జరిపి శాంతిని నెలకొల్పాలని అన్నారు. సీపీఐ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 20 నుంచి 24వ తేదీ వరకు ఒంగోలులో జరగనున్నాయని, ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ముందుగా సీపీఐ జెండాను ఆయన ఆవిష్కరించారు. సభలో సీపీఐ నాయకులు డి.శ్రీనివాస్, టీసీహెచ్ చెన్నయ్య, కె.వి.కృష్ణగౌడ్, నక్కా తిరుపతయ్య, ఎం.సాంబశివరావు, బి.రామయ్య, శ్రీను, వెంకటశివయ్య, ఎం.వెంకటేశ్వర్లు, కె.గురవయ్య పాల్గొన్నారు.

వైభవంగా శిఖర కలశ ప్రతిష్ఠ

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో పట్టాభిరామస్వామి ఆలయంలో శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవం వేదపండితుల ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. అర్చనలు, హోమాలు, గ్రామోత్సవం ఘనంగా సాగాయి. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్న సంతర్పణ చేశారు. పూజల్లో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొన్నారు.



పూజల్లో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

తహశీల్దార్‌ను సన్మానించిన వైఎస్సార్ సీపీ నాయకులు



తహశీల్దార్ ను సన్మానిస్తున్న మండల వైఎస్సార్ సీపీ నాయకులు

పుల్లలచెరువు: ఇటీవల పుల్లలచెరువు మండల తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కే వెంకటేశ్వరరావును మంగళవారం మండల వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి సన్మానించారు. చాపలమడుగు సర్పంచ్ టి.సత్యనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఎల్.రాములు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రఘు. మాజీ డైరెక్టర్ బి.సుబ్బారెడ్డి, నాయకులు ఆంజనేయులు, ఏడుకొండలు, సింగాప్రసాద్, లింగం రవి, ఖాసిం, గంగరాజు తహశీల్దార్‌ను కలిసి సన్మానించి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతుల రెవెన్యూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకుచ్చారు. తహశీల్దార్ మాట్లాడుతూ సాధ్యమైంత త్వరగా విచారణ చేసి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

ఘనంగా సీతా నవమి వేడుకలు

మార్కాపురం: పట్టణంలో నెహ్రూ బజారులో పాండు రంగ స్వామి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం సీతా నవమి వేడుకలు(సీతా దేవి పుట్టిన రోజు) భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి మహిళ సీతా మాతను ఆదర్శంగా తీసుకోవాలని, కుటుంబ విలువలు కాపాడాలని కోరారు. వీహెచ్‌పీ జిల్లా దుర్గా వాహిని జి.అపర్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంటక వనజాక్షి, జి.వరలక్ష్మమ్మ, ప్రసన్న, లావణ్య, శాసనాల సరోజిని, పి.జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

- వెండి చీరతో అలంకారం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని మంగళవారం వెండి చీరతో ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చనలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం వాసవీ పారాయణం, లలితా సహస్ర నామ పారాయణం చేశారు. ఆలయ అధ్యక్ష కార్యదర్శులు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, రామడుగు రమేష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నేటితో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.



వెండిచీర అలంకరణలో వాసవీమాత అమ్మవారు

జన్మన్ గృహాలను త్వరగా పూర్తి చేసుకోవాలి

- హౌసింగ్ పీడీ ప్రసాద్



జన్మన్ గృహాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ ప్రసాద్

పుల్లలచెరువు: జన్మన్ పథకం ద్వారా చెంచు గిరిజనులకు అందజేసిన గృహాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని ప్రాజెక్టు డైరెక్టర్ పెరుగు ప్రసాద్ అన్నారు. మండలంలోని గారపెంట చెంచుగూడెంలో మంగళవారం జన్మన్ పథకం ద్వారా నిర్మించుకుంటున్న గృహాలను ఆయన తనిఖీ చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. గిరిజనులకు మాత్రమే ఈ పథకం ద్వారా గృహాలు కేటాయించారని, సకాలంలో గృహాలను పూర్తి చేసుకోవాలన్నారు. అదనంగా మరో రూ.లక్ష ఇస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గృహాలు నిర్మించేందుకు ఆర్‌డీటీ సంస్థ కూడా సహకారం అందిస్తుందని అన్నారు. ఈయన వెంట ఈఈ పవన్ కుమార్, ఏఈ జాన్‌సుందర్‌రాజు పాల్గొన్నారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

- 30 లీటర్ల నాటు సారా స్వాధీనం



నిందితుడుని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు గూడేల పరిసర ప్రాంతాల్లో అక్రమ నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు బుధవారం విస్తృత దాడులు నిర్వహించి భారీగా నాటుసారా స్వాధీనం చేసుకోవటంతో పాటు ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడులకు సంబంధించి సీఐ ముక్కు వెంకటరెడ్డి కథనం మేరకు మండల పరిధిలోని వై.చర్లోపల్లి పరిసర ప్రాంతాల సమీపంలో అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో దాడులు చేసి 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. దీంతో పాటు నల్లగుంట్లకు చెందిన దాసరి రామయ్యను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన మెగావత్ చందూనాయక్ అనే వ్యక్తిని కేసులో నిందితునిగా చేర్చారన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

సమ్మెను జయప్రదం చేయండి



సమ్మె నోటీసు ఇస్తున్న ఆశావర్కర్లు

చేదు: సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని ఆశావర్కర్ల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు యు కొండమ్మ, ఎం నాగమల్లేశ్వరి అన్నారు. ఈ మేరకు ఆశావర్కర్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి రవితేజకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.లక్ష ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా గర్భిణులు, బాలింతలకు, టీబీ, హెచ్ఐవీ రోగులకు సేవలందిస్తున్న ఆశా వర్కర్లు వేతనాలు చాలక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆశావర్కర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, మృతి చెందినప్పుడు మట్టి ఖర్చులకు రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. పి.యోగేశ్వరమ్మ, కృపమ్మ, సరస్వతి, సుశీల, లక్ష్మి, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

దర్శి(కురిచేడు): సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎం రమేష్ బాబు కోరారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో దర్శిలో జిల్లా మహాసభలు జరుగుతాయని ఆయన తెలిపారు. జిల్లా మహాసభల కరపత్రాలను మంగళవారం ఆహ్వానసంఘం గౌరవ అధ్యక్షుడు, మోహన్‌మిల్క్ లైన్ అధినేత కె.శివరామిరెడ్డి ఆవిష్కరించారు. దర్శిలో మహాసభలు జరగడం ఇదే ప్రథమమని, వాటిని జయప్రదం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.హనుమంతరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్ కరుణానిధి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రామాంజియాదవ్, సింగరకొండ శ్రీను, సీపీఐ నాయకులు కల్లూరి పెద్ద ఆంజనేయులు, బత్తుల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



చిన్నారులను సత్కరిస్తున్న సీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్లు

యర్రగొండపాలెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరి ఐదేళ్ల వయసు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, వారి విద్యాభ్యాసం సక్రమంగా ముందుకు సాగుతుందని సీడీపీఓ ఎం.పద్మావతి అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పాఠశాల సంసిద్ధత ఉత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఆహ్వాన పత్రికలు అందజేసి కార్యక్రమానికి ఆహ్వానించారు. పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసిన పిల్లలు తమ తల్లిదండ్రుల సమక్షంలో రిజిస్ట్రేషన్ స్టాల్ వద్ద పేర్లు నమోదు చేసుకున్నారు. సమగ్ర అభివృద్ధి స్టాల్ వద్ద చిన్నారుల అభ్యాసన నైపుణ్యాలను పరిశీలించి కౌన్సిలింగ్ స్టాల్ వద్ద తల్లిదండ్రులకు తమ పిల్లల బలాలు మెరుగు పరచాల్సిన అంశాలను వివరించారు. గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి చిన్నారులకు సర్టిఫికెట్లతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.ఆంజనేయులు, జిల్లా ఐటీసీ ప్రథం కో ఆర్డినేటర్ వెంకటరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మజ, సుబ్బమ్మ, హైమావతి, కుమారి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.